24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/24/2026 10:11 PM Page 1

మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
ఆదివారం 25 అక్టోబర్ 2026 పేజీలు : 4

## ర్యాగింగ్‌కు చరమగీతం పాడాలి!

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దు

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

బాపట్ల అర్బన్ సీఐ ఆర్. రాంబాబు

బాపట్ల: రక్షణ క్రైమ్ స్పెషల్

సరదా పేరుతో ర్యాగింగ్ చేసినా.. సీనియారిటీ పేరుతో జూనియర్లను వేధించినా ఇక చిక్కులు తప్పవు! క్షణిక ఆనందం కోసం విద్యార్థి జీవితాన్ని, భవిష్యత్తు అవకాశాలను పణంగా పెడితే కఠిన పరిణామాలు ఎదుర్కోవాల్సిందే. ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్ష నుంచి జరిమానా వరకు చట్టపరమైన చర్యలు తప్పవని బాపట్ల అర్బన్ సీఐ ఆర్. రాంబాబు హెచ్చరించారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ర్యాగింగ్ చేస్తే చదువు, కెరీర్ దెబ్బతినడమే కాదు.. చట్టం ముందు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులారా... వేధింపులకు స్వస్తి పలికి, క్రమశి క్షణతో మెలగాలని సూచించారు.



వివరాలు 2లో..

## తరాలు మారిన..తరగని
# అనుబంధం

- జూలకంటి బ్రాండ్.. 'బృంగా' బంధం!
- ఏడు దశాబ్దాల అనుబంధానికి రాజకీయ గుర్తింపు..
- నాగిరెడ్డి నాటి వారసత్వం.. బ్రహ్మారెడ్డి నేటి వ్యూహం
- దుర్గి జడ్పీటీసీగా బృంగా నాగజ్యోతి ఏకగ్రీవ ఎన్నికతో
- మరోసారి తెరపైకి వచ్చిన పాత అనుబంధం

పల్నాడు రాజకీయాల్లో 'జూలకంటి' అంటే ఓ పేరు కాదు.. ఓ బ్రాండ్! ఆ బ్రాండ్ వెనుక తరతరాల రాజ కీయ ప్రస్థానం.. నమ్మినవారికి అండగా నిలిచిన చరిత్ర.. ఏడు దశాబ్దాల అనుబంధాలకు నిదర్శ నంగా నిలిచిన 'బృంగా' కుటుంబం! నాడు స్వర్గీ య జూలకంటి నాగిరెడ్డి వెన్నంటి నడిచిన గుర వయ్య కుటుంబం.. నేడు అదే రాజకీయ వార సత్వంలో మరో అడుగు వేసింది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి చొరవతో బృంగా లిం గయ్య కోడలు నాగజ్యోతికి దుర్గి జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం దక్కింది. ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సమాచారం. ఇదీ జూలకంటి బ్రాండ్.. బృంగా బంధం! అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

(శిలార్) నరసరావుపేట: ప్రత్యేక ప్రతినిధి



వివరాలు 2లో..

## కూటమిలో సీట్ల కుస్తీ!

వార్డు నుంచి గ్రామం వరకు అదే పంచాయితీ..

ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారిన సర్దుబాట్లు



ఎడిటర్ నరేంద్ర



పొత్తు కుదిరింది.. పీఠం పంచేది ఎవరు? స్నేహం ఉంది.. సీటు వదులుకునేదెవరు? ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూటమి రాజకీయాలు ఇప్పుడు ఈ ప్రశ్నల చుట్టూనే తిరుగుతున్నాయి. వార్డు సభ్యుడి స్థానం నుంచి జడ్పీటీసీ పీఠం వరకు ఆశావహుల లెక్కలు ఒకవైపు.. మిత్రపక్షాల పట్టింపులు మరోవైపు! ఎవరికి ఎన్ని సీట్లు? ఏ వార్డులో ఏ పార్టీ జెండా? అన్నది తేలక ఎమ్మెల్యేలకు కొత్త తలనొప్పి మొదలైంది. సర్దుబాటు సూత్రం కుదరకపోతే అసమ్మతి సెగలు.. రెబల్స్ బెడద తప్పదన్న ఆందోళనతో కూటమి నేతలకు స్థానిక ఎన్నికలు అసలైన అగ్నిపరీక్షగా మారుతున్నాయి.

వివరాలు 6లో..

## ఎంపీపీగా 'వజ్రం'!

వెల్దుర్తి మండల పరిషత్ పీఠంపై నాయక్

1983 నుంచి టీడీపీ అభిమాని కుటుంబం

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఎంపికతో రాజకీయంగా కొత్త ప్రస్థానం



పేరు వజ్రం.. రాజకీయ ప్రస్థానంలో మరో మెరుపు! నాలుగు దశాబ్దాలకు పైగా టీడీపీతో అనుబంధం.. అందరితో కలిసి మెలిసి ఉండే మనస్తత్వం.. వెరసి వెల్దుర్తి మండల పరిషత్ పీఠంపై కూర్చునే అవకాశం వజ్రం నాయక్‌ను వరించింది. మొరసపెంటకు చెందిన ఆయనను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి ఎంపీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. గొట్టిపాళ్ల ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన వజ్రం నాయక్.. త్వరలో ఎంపీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

మాచర్ల రక్షణ న్యూస్

2లో.

## గుంటూరు అభివృద్ధే అజెండా!

కూటమి మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ విస్తృత ప్రచారం

ఆత్మీయ సమావేశాలు.. ఇంటింటికీ పలకరింపులు

ఐక్యంగా పనిచేయాలని కూటమి నేతల పిలుపు

గుంటూరు అభివృద్ధి అజెండా.. ప్రజలే కేంద్రంగా ప్రచార పర్వం! ఆత్మీయ సమావేశాలు, ఇంటింటి పలకరింపులు, వివిధ వర్గాలతో భేటీలతో కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ప్రచారాన్ని విస్తృతం చేశారు. రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని హామీ ఇస్తున్నారు. మరోవైపు కూటమి నేతలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిస్తున్నారు. వ్యాపారులు, బీసీ నాయకులు, ప్రైవేటు ఉపాధ్యా యులతో సమావేశాలు రాజకీయంగా ప్రాధా న్యం సంతరించుకున్నాయి.

గుంటూరు పొలిటికల్ స్పెషల్



6లో.

## మాజీ మంత్రి రజిని ఘటనపై ఎస్ఈసీ సీరియస్

ఎస్సై ప్రియాంకను విధుల నుంచి తప్పించాలని ఆదేశం

నిష్పక్షపాత విచారణకు పల్నాడు ఎస్పీకి ఆదేశాలు

6లో.

చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజిని నివాసం వద్ద చోటుచేసుకున్న ఘటనపై రాష్ట్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. రజినిని పోలీసులు అడ్డుకోవడం, తోపులాటలో ఆమె కిందపడినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశించింది. చిలకలూరిపేట రూరల్ ఎస్సై ప్రియాంకను ఎన్నికల విధులతో పాటు సాధారణ విధుల నుంచి తక్షణమే తప్పించాలని పల్నాడు జిల్లా ఎస్పీని ఆదేశించింది. బాధ్యులపై చర్యలు తీసుకుని అదే రోజు సాయంత్రం 5 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది.



చిలకలూరిపేట: రక్షణ న్యూస్

## అవినీతి వైద్యుడు..

రూ.25 వేల లంచం తీసుకుంటూ వైద్యుడు పట్టుబాటు!

షోకాజ్ నోటీసు వ్యవహారంలో నగదు డిమాండ్?

తుళ్లూరు పీహెచ్‌సీలో ఏసీబీ అధికారుల వల

2లో.



తుళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. రూ.25 వేల లంచం తీసుకుంటున్న ఆరోపణలపై వైద్యుడు శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. విధులకు గైర్హాజరైన ఉద్యోగికి జారీ చేసిన షోకాజ్ నోటీసు వ్యవహారంలో లంచం డిమాండ్ చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, కేసు నమోదు, తదుపరి చర్యలపై అధికారిక సమాచారం వెల్లడికావాల్సి ఉంది.

తుళ్లూరు, రక్షణ క్రైమ్ స్పెషల్

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/24/2026 10:11 PM Page 2



# ఎంపీపీగా 'వజ్రం'!

మొదటి పేజీ తరువాయి

మాచర్ల రక్షణ న్యూస్

పేరు వజ్రం.. నమ్మకంలోనూ వజ్రమే! దశాబ్దాలుగా ఒకే రాజకీయ పార్టీ పట్ల అభిమానం.. అందరితో కలిసిపోయే మనస్తత్వం.. స్థానికంగా సత్సంబంధాలు.. వెరసి వెల్దుర్తి మండల రాజకీయాల్లో ఇప్పుడు 'వజ్రం' పేరు వినిపిస్తోంది. పల్నాడు జిల్లాలో రాజకీయంగా కీలకమైన వెల్దుర్తి మండల పరిషత్ అధ్యక్ష పదవికి వజ్రం నాయక్ ఎంపికయ్యారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆయనకు అవకాశం కల్పించారు. గొట్టిపాళ్ల ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన వజ్రం నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సమాచారం. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. త్వరలోనే ఆయన ఎంపీపీ పీఠాన్ని అధిరోహించనుండటంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అనుచరుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

**రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు.. వెల్దుర్తి!**

పల్నాడు జిల్లాలో అత్యంత సమస్యాత్మక మండలాల్లో ఒకటిగా పేరున్న వెల్దుర్తికి రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ మండలానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యేలుగా ఎన్నికై రాష్ట్ర రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. రాజకీయ చైతన్యం, స్థానిక సమీకరణాలు, నాయకుల మధ్య పోటీతో వెల్దుర్తి ఎప్పుడూ ప్రత్యేకంగా నిలుస్తుంటుంది. అలాంటి మండల పరిషత్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు వజ్రం నాయక్ సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఎంపిక స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది.

**1983 నుంచి టీడీపీతో అనుబంధం!**

వజ్రం నాయక్ స్వగ్రామం మొరసపెంట. ఆరుగురు అన్నదమ్ముల కుటుంబంలో ఆయన ఒకరు. 1983 నుంచి ఆయన కుటుంబం తెలుగుదేశం పార్టీ పట్ల అభిమానంతో కొనసాగుతోంది. రాజకీయ అనుబంధాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, పార్టీ శ్రేణులతో కలిసి మెలిసి ఉండటం, స్థానికులతో సత్సంబంధాలు కొనసాగించడం వజ్రం నాయక్ ప్రత్యేకతగా ఆయనకు సన్నిహితులు చెబుతున్నారు. అందరినీ కలుపుకుపోయే తత్వం ఆయనకు గుర్తింపు తెచ్చిందని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఎమ్మెల్యే ఎంపికతో కొత్త బాధ్యతలు!**

వెల్దుర్తి మండల పరిషత్ అధ్యక్ష పదవికి వజ్రం నాయక్‌ను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎంపిక చేయడంతో ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక ఘట్టం మొదలుకానుంది. గొట్టిపాళ్ల ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయనకు ఎంపీపీగా బాధ్యతలు చేపట్టే అవకాశం లభించనుంది. అధికారిక ప్రకటన అనంతరం పదవీ బాధ్యతల స్వీకరణపై స్పష్టత రానుంది.వజ్రం నాయక్ ఎంపీపీ కానున్నారన్న సమాచారం తెలియడంతో బంధువులు, స్నేహితులు, అభిమానులు ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు. ఈ పరిణామంతో మొరసపెంటలోనూ సందడి నెలకొంది. తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి వజ్రం నాయక్ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు.

**పేరు వజ్రం.. కొత్త బాధ్యతలతో మరో అడుగు!**

మండల పరిషత్ అధ్యక్ష పదవి అలంకారప్రాయమైన హోదా మాత్రమే కాదు.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సంస్థల సమన్వయం, ప్రజల అవసరాలపై స్పందించాల్సిన బాధ్యత కూడా. ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వజ్రం నాయక్ తనకు లభించిన అవకాశాన్ని ఎలా వినియోగించుకుంటారన్నది ఆసక్తికరంగా మారనుంది. దశాబ్దాల రాజకీయ అనుబంధం నుంచి మండల స్థాయి నాయకత్వం వైపు సాగుతున్న ఆయన ప్రయాణంలో ఇది కీలక మైలురాయిగా నిలవనుంది.వెల్దుర్తి మండల రాజకీయాల్లో 'వజ్రం' నాయక్ పేరు ఇప్పుడు కొత్త చర్చకు తెరతీసింది. అధికారిక ప్రకటన వెలువడితే ఎంపీపీగా ఆయన ప్రస్థానానికి లాంఛనంగా శ్రీకారం చుట్టినట్లవుతుంది.

# అవినీతి వైద్యుడు...

మొదటి పేజీ తరువాయి

తుళ్లూరు, రక్షణ క్రైమ్ స్పెషల్

ప్రభుత్వ వైద్య సేవల్లో అవినీతి ఆరోపణలు కలకలం రేపాయి. తుళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ రూ.25 వేల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడినట్లు వార్తలు వెలువడ్డాయి. విధులకు గైర్హాజరైన ఉద్యోగికి జారీ చేసిన షోకాజ్ నోటీసు వ్యవహారంలో అనుకూలంగా వ్యవహరించేందుకు నగదు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక కథనాలు పేర్కొన్నాయి.తుళ్లూరు పీహెచ్‌సీలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు నెల రోజుల పాటు విధులకు గైర్హాజరైన నేపథ్యంలో ఆయనకు వైద్యాధికారి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఆంధ్రప్రభ కథనం వెల్లడించింది. ఈ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు లంచం డిమాండ్ చేసినట్లు పేర్కొంది. ఈ క్రమంలో రూ.25 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపింది.ఈ దాడిలో ఏసీబీ డీఎస్పీ టి.వి.వి. ప్రతాప్‌కుమార్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నట్లు కథనంలో పేర్కొన్నారు. ఘటనకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగుతున్నట్లు అందుబాటులో ఉన్న సమాచారం వెల్లడిస్తోంది.ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఫిర్యాదులపై ఏసీబీ నిఘా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఘటన చర్చనీయాంశమైంది. కేసులో అధికారికంగా వెల్లడించే పూర్తి వివరాలు, తదుపరి చట్టపరమైన చర్యలకు సంబంధించిన సమాచారం తెలియాల్సి ఉంది.

# తరాలు మారిన..తరగని అనుబంధం

మొదటి పేజీ తరువాయి

(శిలార్)నరసరావుపేట: ప్రత్యేక ప్రతినిధి

పల్నాడు రాజకీయాల్లో కొన్ని పేర్లకు పరిచయం అక్కర్లేదు.. కొన్ని కుటుంబాలకు పదవులతోనే కాదు, తరతరాల అనుబంధాలతో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. అలాంటి రాజకీయ బ్రాండ్ పేర్లలో 'జూలకంటి' ఒకటి. ఆ కుటుంబం వెంట నడిచిన నాయకులు.. ఆ కుటుంబాన్ని నమ్ముకున్న అనుచరులు.. రాజకీయంగా ఎదిగిన కుటుంబాలు.. ఇలా దశాబ్దాలుగా సాగుతున్న ప్రస్థానంలో మరో పేరు ఇప్పుడు చర్చకు వచ్చింది. అదే 'బ్యూగా'. జూలకంటి కుటుంబానికి, బ్యూగా కుటుంబానికి ఉన్న సుమారు 70 ఏళ్ల అనుబంధానికి దుర్గి జడ్పీటీసీ స్థానం కొత్త రాజకీయ గుర్తింపుగా నిలుస్తోంది. టీడీపీ అభ్యర్థిగా బ్యూగా నాగజ్యోతిని ఎంపిక చేయడం.. ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సమాచారం రావడంతో పల్నాడు రాజకీయాల్లో ఈ బంధం మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది.

**అప్పట్లో నాగిరెడ్డి.. ఇప్పట్లో బ్రహ్మారెడ్డి!**

జూలకంటి బ్రాండ్‌కు పునాదులు వేసిన వ్యక్తి స్వర్గీయ జూలకంటి నాగిరెడ్డి. ఆయనను అభిమానులు 'పల్నాటి పులి', 'అసెంబ్లీ అందగాడు' అని ఆప్యాయంగా పిలుచుకునేవారు. మాచర్ల పంచాయతీ సమితి అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన.. 1972లో మాచర్ల ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. పులి గుర్తుపై గెలుపొందిన ఆయనకు అప్పట్లోనే 'పల్నాటి పులి' అనే పేరు స్థిరపడింది. ఆ విజయంతో మాచర్ల రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన నాగిరెడ్డి.. నియోజకవర్గానికే పరిమితం కాకుండా రాష్ట్రస్థాయి రాజకీయాల్లోనూ గుర్తింపు పొందారు.నాటి రాజకీయ ఉద్దండులైన కాసు బ్రహ్మానందరెడ్డి, వెంగళరెడ్డి సోదరులతో రాజకీయంగా తలపడిన నాగిరెడ్డి.. పీవీ నరసింహారావు, జలగం వెంగళరావులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. 1983లో గురజాల నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం ఐడీసీ, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. రాజకీయంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవడమే కాకుండా, తనను నమ్ముకున్న నాయకులకు అవకాశాలు కల్పించడం ద్వారా అనుచర వర్గాన్ని బలోపేతం చేశారు.

**జూలకంటి నీడలో ఎదిగిన నాయకులు!**

జూలకంటి నాగిరెడ్డి రాజకీయ ప్రస్థానం వ్యక్తిగత విజయాలకే పరిమితం కాలేదు. ఆయనతో కలిసి నడిచిన నాయకులు, వివిధ సంస్థల్లో కీలక పదవులు చేపట్టిన వారు ఆ బ్రాండ్ విస్తరణకు ప్రతీకలుగా నిలిచారు. మాజీ ఎంపీ కోట సైదయ్య, మాచర్ల పంచాయతీ సమితి అధ్యక్షులుగా పనిచేసిన తోట లచ్చయ్య, నల్లపాటి కోటయ్య, పాలువాయి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాయితి వెంకట నర్సిరెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పులుసు పెద్ద రామిరెడ్డి, అప్పటి ఎల్‌ఎంబీ బ్యాంకు (ప్రస్తుత జీడీసీసీ బ్యాంకు) ఛైర్మన్ గొబ్బూరి కోటి నర్సయ్య, మాచర్ల, వెల్దుర్తి మాజీ ఎంపీపీలు సానుకొమ్ము పుల్లారెడ్డి, పులుసు వెంకటరెడ్డి, పులుసు పెద్ద నాగిరెడ్డి తదితరులు ఆ రాజకీయ ప్రస్థానంలో ప్రస్తావించదగిన పేర్లు.తన చుట్టూ ఉన్న నాయక త్వాన్ని ప్రోత్సహించడం, గ్రామస్థాయి నుంచి రాజకీయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించడం నాగిరెడ్డి శైలిగా ఆయన అనుచరులు గుర్తుచేసుకుంటారు. అందుకే 'జూలకంటి' అనే పేరు ఒక కుటుంబానికి మాత్రమే పరిమితం కాకుండా, ఆ కుటుంబంతో అనుబంధం కలిగిన నాయ కుల రాజకీయ గుర్తింపుగానూ మారిందనే అభిప్రాయం ఉంది.

**వారసత్వానికి కొనసాగింపుగా బ్రహ్మారెడ్డి!**

నాగిరెడ్డి రాజకీయ వారసత్వం కుటుంబంలోనూ కొనసాగింది. ఆయన సతీమణి దుర్గాంబ 1999లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాచర్ల ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూనే, నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి బ్రహ్మారెడ్డి ప్రయత్నిస్తున్నారు. 2022లో మాచర్ల టీడీపీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పార్టీ కార్యకలాపాల్లో ఆయన చురుకుదనం పెరిగింది.ఈ క్రమంలోనే దశాబ్దాలుగా తమ కుటుంబంతో అనుబంధం కలిగిన బ్యూగా కుటుంబానికి రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. ఇది కేవలం ఒక అభ్యర్థి ఎంపిక మాత్రమే కాదని, పాత అనుబంధాలకు గుర్తింపునిచ్చే పరిణామమని స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**బ్యూగా కుటుంబంతో ఏడు దశాబ్దాల బంధం!**

మాచర్ల నియోజకవర్గంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన బ్యూగా కుటుంబానికి, జూలకంటి కుటుంబానికి నాగిరెడ్డి కాలం నుంచే అనుబంధం ఉంది. అప్పట్లో గ్రామానికి చెందిన బీసీ నాయకుడు బ్యూగా గురవయ్య.. నాగిరెడ్డికి అనుచరుడిగా ఉండేవారు. ఆయన తరువాతి తరాల వారు కూడా జూలకంటి కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు.ఆత్మకూరు ఒకప్పుడు వర్గ ఘర్షణలతో వార్తల్లో నిలిచిన గ్రామం. ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. బీసీ వర్గంపై దాడి జరిగిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించినట్లు స్థానికులు గుర్తుచేసుకుంటారు. అనంతర కాలంలో బ్యూగా లింగయ్య ఆ వర్గానికి నాయకత్వం వహించారు.జూలకంటి బ్రహ్మానందరెడ్డి రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉన్న సమయంలో బ్యూగా లింగయ్య కూడా రాజకీయ కార్యకలాపాలను తగ్గించారు. అయితే 2022లో బ్రహ్మారెడ్డి మాచర్ల టీడీపీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టడంతో లింగయ్య మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ప్రారంభించారు. ఇలా పాత పరిచయం మళ్లీ రాజకీయ చైతన్యంగా మారింది.

**బ్యూగా నాగజ్యోతికి అవకాశం.. ఏకగ్రీవ ఎన్నిక!**

తరతరాలుగా కొనసాగుతున్న ఈ అనుబంధానికి తాజా పరిణామం దుర్గి జడ్పీటీసీ స్థానం. బ్యూగా లింగయ్య కోడలు బ్యూగా నాగజ్యోతిని టీడీపీ అభ్యర్థిగా ఎంపిక చేయడం ద్వారా జూలకంటి కుటుంబం తమతో సుదీర్ఘ అనుబంధం కలిగిన కుటుంబానికి ప్రాధాన్యం ఇచ్చింది. నాగజ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సమాచారం వెలువడగా, అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.పల్నాడు రాజకీయాల్లో పదవులు మారవచ్చు.. తరాలు మారవచ్చు.. రాజకీయ సమీకరణాలు కొత్త రూపం దాల్చవచ్చు. కానీ కొన్ని అనుబంధాలు మాత్రం కాలంతోపాటు కొనసాగుతుంటాయి. జూలకంటి నాగిరెడ్డి కాలంలో మొదలైన బ్యూగా కుటుంబ బంధం.. బ్రహ్మానందరెడ్డి హయాంలోనూ రాజకీయంగా ప్రాధాన్యం పొందడం అందుకు ఉదాహరణగా నిలుస్తోంది.

# ర్యాగింగ్‌కు చరమగీతం పాడాలి!

మొదటి పేజీ తరువాయి

బాపట్ల: రక్షణ క్రైమ్ స్పెషల్

విద్యార్థి జీవితం బంగారు భవిష్యత్తుకు పునాది కావాలి.. భయానికి, వేధింపులకు వేదిక కాకూడదు. సీనియర్లు, జూనియర్ల మధ్య స్నేహం వెల్లివిరియాల్సిన విద్యాసంస్థల్లో ర్యాగింగ్ వంటి వికృత సంస్కృతికి ఏమాత్రం చోటివ్వకూడదని బాపట్ల అర్బన్ సీఐ ఆర్. రాంబాబు స్పష్టం చేశారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, విద్యార్థులను వేధించడం, అవమానించడం, అసభ్యకరమైన పనులు చేయించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించి, పరస్పర గౌరవం, సహకారం, సత్సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.బాపట్ల వ్యవసాయ కళాశాలలో నూతనంగా చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులు, సీనియర్ విద్యార్థుల మధ్య సత్సంబంధాలను పెంపొందించేందుకు నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ పేరుతో జరిగే వేధింపులు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడమే కాకుండా, వారి చదువు, వ్యక్తిగత అభివృద్ధి, భవిష్యత్తుపైనా ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. సరదా పేరుతో తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం, వారి ఆత్మగౌరవాన్ని కించపరచడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు.

**చట్టాన్ని అతిక్రమిస్తే శిక్ష తప్పదు**

ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులు తమ భవిష్యత్తును తామే ప్రమాదంలోకి నెట్టుకున్నట్లవుతుందని సీఐ రాంబాబు హెచ్చరించారు. ఇలాంటి ఘటనల్లో నేరం రుజువైతే చట్టప్రకారం శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ర్యాగింగ్ కేసుల్లో శిక్షకు గురికావడం వల్ల విద్యార్థుల విద్యా ప్రస్థానం, ఉద్యోగ అవకాశాలు, విదేశీ విద్య లేదా ప్రయాణాలకు సంబంధించిన ప్రక్రియలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు. క్షణికమైన సరదా కోసం జీవితాంతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితిని తెచ్చుకోవద్దని సూచించారు.ఆంధ్రప్రదేశ్‌లో ర్యాగింగ్‌ను నిరోధించేందుకు 1997లో ప్రత్యేక చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ చట్టం ప్రకారం నేర తీవ్రతను బట్టి శిక్షలు, జరిమానాలు విధించే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు చట్టంపై అవగాహన కలిగి ఉండటంతోపాటు, ఇతరుల హక్కులను గౌరవించాలని సూచించారు.

**స్నేహమే బలం.. వేధింపులు బలహీనత**

కళాశాలల్లో సీనియర్లు తమ అనుభవాన్ని జూనియర్లకు పంచి, చదువులోనూ, ఇతర కార్యకలాపాల్లోనూ మార్గదర్శకులుగా నిలవాలని సీఐ సూచించారు. కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులకు పరిచయాలు పెంచుకోవడం, కొత్త వాతావరణానికి అలవాటు పడడం వంటి అంశాల్లో సీనియర్లు సహకరించాలని అన్నారు. పరస్పర గౌరవం, సహకారం, బాధ్యతాయుత ప్రవర్తనతోనే ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ర్యాగింగ్ లేదా వేధింపులకు గురైన విద్యార్థులు భయంతో మౌనంగా ఉండకూడదని, తమకు నమ్మకమైన అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం లేదా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకురావాలని సూచించారు. తోటి విద్యార్థులు వేధింపులకు గురవుతున్నట్లు గుర్తించినా బాధ్యతగా స్పందించాలని తెలిపారు. విద్యార్థుల భద్రత విషయంలో కళాశాల యాజమాన్యాలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు.విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ, మానవీయ విలువలు, పరస్పర గౌరవానికి ప్రాధాన్యమివ్వాలని సీఐ రాంబాబు పిలుపునిచ్చారు. ప్రతి విద్యాసంస్థ ర్యాగింగ్ రహిత ప్రాంగణంగా మారినప్పుడే విద్యార్థులు భయంలేకుండా తమ లక్ష్యాల దిశగా ముందుకు సాగగలరని పేర్కొన్నారు. ర్యాగింగ్‌కు స్వస్తి పలికి, స్నేహం, సహకారం, ఆత్మీయతతో కూడిన విద్యా వాతావరణాన్ని నిర్మించేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని ఆయన సూచించారు.

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/24/2026 10:11 PM Page 3



# ఎడ్లపాడులో కొనసాగుతున్న నామినేషన్ల పరిశీలన

## 16 ఎంపీటీసీ స్థానాలకు 48 మంది అభ్యర్థుల నామినేషన్లు



**ఎడ్లపాడు:రక్షణ**

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల పరిశీలన ఎడ్లపాడు మండలంలో కొనసాగుతోంది. ఎంపీటీసీ స్థానాలకు దాఖలైన నామినేషన్ పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పత్రాల తనిఖీ చేపడుతూ, అర్హులైన అభ్యర్థుల నామినేషన్లను ఆమోదిస్తున్నారు. ఎడ్లపాడు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహిస్తున్న ఈ ప్రక్రియను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై. నాగయ్య, ఎంపీడీవో వి. హేమలతాదేవి ఆధ్వర్యంలో అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పలువురు అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. నామినేషన్ పత్రాల్లో వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలిస్తూ ఎన్నికల నిబంధనలను పాటిస్తున్నారు. ఎడ్లపాడు మండలంలో మొత్తం 16 ఎంపీటీసీ స్థానాలకు ఈ నెల 21, 22, 23 తేదీల్లో 48 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను అధికారులు ఒక్కొక్కటిగా తనిఖీ చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నంలోపు పరిశీలన ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

## భద్రతా ఏర్పాట్లపై అధికారులకు కీలక సూచనలు



**గుంటూరు, రక్షణ**

: ఈవీఎంల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. గోడౌన్ వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, తాళాలు, సీల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. నిరంతర పర్యవేక్షణతో పాటు రికార్డుల నిర్వహణలోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను శనివారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈవీఎంలను భద్రపరిచిన గదుల వద్ద ఉన్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని తనిఖీ చేశారు. గోడౌన్ తాళాలు, సీల్స్ స్థితిగతులను సమీక్షించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. గోడౌన్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా విపత్తులు, అగ్నిమాపక శాఖ అధికారి ఎం. శ్రీనివాసరెడ్డి, సహాయ జిల్లా విపత్తులు, అగ్నిమాపక శాఖ అధికారి కె. కృష్ణారెడ్డి, రహదారులు భవనాల శాఖ డీఈ హజరతయ్య, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మల్లేశ్వరి, తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వినుకొండ అభివృద్ధిపై జీవీ ఆంజనేయులుకు సవాల్

## డిగ్రీ కళాశాల స్థలం, సింగర చెరువు అభివృద్ధిపై ప్రశ్నలు



**వినుకొండ:రక్షణ**

పట్టణంలో అభివృద్ధి పనులపై తెలుగుదేశం పార్టీ నాయకుడు జీవీ ఆంజనేయులును ఉద్దేశించి ప్రత్యర్థి వర్గం ప్రశ్నలు సంధించింది. వినుకొండలో డిగ్రీ కళాశాల స్థలాన్ని మీ నాయకులు ఆక్రమించలేదా? అంటూ నిలదీసింది. సింగర చెరువు విస్తీర్ణాన్ని 50 ఎకరాల నుంచి 270 ఎకరాలకు పెంచి పట్టణ ప్రజలకు తాగునీరు అందించే చర్యలు చేపట్టింది బొల్లా బ్రహ్మనాయుడేనని పేర్కొంది. వినుకొండ పట్టణంలో తాము చేపట్టిన అభివృద్ధి పనులు ఏమిటో జీవీ ఆంజనేయులు వివరించాలని ప్రత్యర్థి వర్గం డిమాండ్ చేసింది. కొబ్బరికాయలు కొట్టడం, శంకుస్థాపనలు చేయడం మినహా పూర్తయిన అభివృద్ధి పనులు ఏవైనా ఉన్నాయా? అని ప్రశ్నించింది. పట్టణ అభివృద్ధిపై నాయకులు తమ వాదనలు, పనుల వివరాలను ప్రజల ముందు ఉంచాలని పేర్కొంది. సింగర చెరువు విస్తీర్ణం, డిగ్రీ కళాశాల స్థలానికి సంబంధించిన ఆరోపణలపై సంబంధిత ఆధారాలు, అధికారిక వివరాలు అందుబాటులో ఉంటేనే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుంది

# ప్రజల ఆకాంక్షలే ప్రాధాన్యం.. నగరాభివృద్ధికి అంకితమవుతా!

## కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ

**గుంటూరు: రక్షణ**

నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గుంటూరు సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ హామీ ఇచ్చారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం సహా మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యమిస్తానని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 59వ డివిజన్ సుగాలి కాలనీలో మాదాల చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ ఎన్నికల ప్రచార సమావేశంలో లక్ష్మీ అపర్ణ పాల్గొని మాట్లాడారు. నగరాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. ప్రజలకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు నాయకులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆశీస్సులతో, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్, బుర్ల రామాంజనేయులు మార్గదర్శకత్వంలో నగరాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

**కూటమి పాలనలో అభివృద్ధికి ప్రాధాన్యం...** గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గల్లా మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వెనుకబాటుకు గురైందని విమర్శించారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, సాగు, తాగునీటి వ్యవస్థల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిబద్ధతతో రాష్ట్ర అభివృద్ధి వేగం పుంజుకుంటోందని తెలిపారు.



**59వ డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి...** 59వ డివిజన్‌లో గతంలో వర్షాకాలంలో ముంపు సమస్యలు, అధ్వాన రహదారులు, డ్రైనేజీ ఇబ్బందులతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారని గల్లా మాధవి తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, రహదారుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పరిస్థితుల్లో మార్పు వచ్చిందన్నారు. డివిజన్‌లో మిగిలిన సమస్యలను కూడా గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 59వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి పేరం శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్నవ మోహనకృష్ణ, గుంటూరు నగర మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), జన చైతన్య గ్రూప్ అధినేత, టీడీపీ యువ నాయకుడు మాదాల చైతన్య, మాదాల మీనారత్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల వెంకటేష్ యాదవ్, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాసరావు, గాదె వెంకటేశ్వరరావు, చందు సాంబశివరావు, శ్రీను నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, ఏపీ వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వరరావు, డాక్టర్ నిమ్మల శేషయ్య, భాష్యం నరసయ్య, 59వ వార్డు అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు ఆధ్యా నాయక్, మూల్పూరి పేరయ్య, ఊమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ ఎస్పీ ఉక్కు వ్యూహం

**బాపట్ల రక్షణ న్యూస్**

ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ పటిష్ట భద్రతా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. నామినేషన్ల దశ నుంచే పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ సమస్యాత్మక వ్యక్తులపై నిఘా, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు, విస్తృత తనిఖీలకు ఆదేశాలిచ్చారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగడమే లక్ష్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని, గతంలో సమస్యలు సృష్టించిన వ్యక్తుల కదలికలను పరిశీలించాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా 244 కేసుల్లో 1,380 మందిపై బైండోవర్ చర్యలు చేపట్టారు. బాపట్ల సబ్ డివిజన్‌లో 419 మంది, చీరాలలో 509 మంది, రేపల్లెలో 452 మందిపై చర్యలు తీసుకున్నారు. పోలీసు భద్రత కోరిన 12 మంది అభ్యర్థులకు ప్రత్యేక ఎస్కార్ట్ కల్పించి నామినేషన్లు దాఖలు చేసేలా చర్యలు చేపట్టారు. జిల్లాలో 17 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్నికల కోసం 24 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 39 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, 24 ఎం సీసీ బృందాలు, 24 వీడియోగ్రఫీ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు.




మొత్తం 1,092 పోలింగ్ కేంద్రాలు, 593 పోలింగ్ లొకేషన్ల పరిధిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టగా, 92 హైపర్ సెన్సిటివ్, 138 సెన్సిటివ్ లొకేషన్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేలకుపైగా నగదు తీసుకెళ్లరాదని సూచించారు. చిన్నపాటి వివాదాలు సైతం పెద్ద ఘర్షణలకు దారితీయకుండా తక్షణమే స్పందించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ చిన్నచిన్న ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో, రానున్న ఎన్నికల దశల్లోనూ ఇదే అప్రమత్తత కొనసాగించాలని పోలీసు యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీసులకు సహకరించి ఎన్నికల ప్రశాంతతను కాపాడాలని కోరారు.

# గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

## అధికారులకు వినతిపత్రం అందజేసిన బాలల పార్లమెంట్ సభ్యులు

**తాడేపల్లి, రక్షణ**

: కొలనుకొండ గ్రామంలో పిల్లల కోసం గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఎ.పి.జె. అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ సభ్యులు కోరారు. అప్పటి వరకు కనీసం రెండు, మూడు దినపత్రికలను అందుబాటులో ఉంచాలని మహిళా పోలీసు రాధికకు వినతిపత్రం అందజేశారు. తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామంలో గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం బాలల పార్లమెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలు, పిల్లలకు అవసరమైన సౌకర్యాలు, ప్రభుత్వం కల్పించాల్సిన వసతులపై సభ్యులు చర్చించారు. అనంతరం సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా నిర్వహించే ఈ సమావేశాల్లో పిల్లలు తమ సమస్యలను చర్చించి, అవసరమైన సందర్భాల్లో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యుల సహకారంతో సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నారు. ఈ సందర్భంగా గుడ్ షెఫర్డ్ సిబ్బంది అత్తోట పోతురాజు మాట్లాడుతూ పిల్లల సర్వతోముఖాభివృద్ధిలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పుస్తక పఠనం వల్ల పిల్లల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకత, జ్ఞానం, భాషా నైపుణ్యాలు పెరుగుతాయని చెప్పారు. వివిధ రకాల పుస్తకాలు చదవడం ద్వారా పదజాలం పెరిగి, భాషపై పట్టు సాధించవచ్చన్నారు. చదువుపై ఏకాగ్రత పెరగడంతోపాటు కథల్లోని పాత్రల ద్వారా మంచి, చెడులను విశ్లేషించే సామర్థ్యం అలవడుతుందని వివరించారు.



కథల పుస్తకాలు, కామిక్స్, సైన్స్ ఫిక్షన్ వంటి పుస్తకాలు చదవడం వల్ల పిల్లల్లో ఊహాశక్తి, సృజనాత్మకత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గ్రంథాలయంలో నిశ్శబ్దంగా ఉండటం, పుస్తకాలను జాగ్రత్తగా చూసుకోవడం, తీసుకున్న పుస్తకాలను సకాలంలో తిరిగి ఇవ్వడం వంటి అలవాట్లతో క్రమశిక్షణ, బాధ్యత పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో పిల్లలు మొబైల్ ఫోన్లు, టీవీలకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని, గ్రంథాలయాలకు వెళ్లడం ద్వారా స్క్రీన్ సమయాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని బాలల పార్లమెంట్ సభ్యులు కోరారు. గ్రంథాలయం ఏర్పాటు చేసే వరకు పిల్లల కోసం కనీసం రెండు, మూడు దినపత్రికలను అందుబాటులో ఉంచాలని మహిళా పోలీసు రాధికకు వినతిపత్రం సమర్పించారు. పిల్లలు వారానికి కనీసం ఒక్కసారైనా గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని అత్తోట పోతురాజు సూచించారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సిబ్బంది అత్తోట పోతురాజు, మహిళా పోలీసు రాధిక, ఆశా కార్యకర్తలు, బాలల పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/24/2026 10:11 PM Page 4



# 27, 28 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలు

## జీఎంసీ, తెనాలిలో ఏర్పాట్లు.. ఎన్నికల విధుల్లోని సిబ్బందికి అవకాశం

**గుంటూరు, రక్షణ**

గుంటూరు నగరపాలక సంస్థ (జీఎంసీ), తెనాలి పురపాలక సంఘం పరిధిలో ఈ నెల 27, 28 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి శనివారం మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, రిటర్నింగ్ అధికారులు, జోనల్, రూట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరికీ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని స్పష్టం చేశారు.పోలింగ్ సామగ్రి పంపిణీ, తిరిగి స్వీకరించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, పోలింగ్ సామగ్రి పంపిణీలో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం జరగకూడదని స్పష్టం



చేశారు. సామగ్రిలో ఏ ఒక్క వస్తువు కూడా తక్కువ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం సామగ్రిని క్రమపద్ధతిలో స్వీకరించి, త్వరితగతిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాలని సూచించారు. ఓటర్లకు ఫొటో ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఆహార పంపిణీ విషయంలోనూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన వాహనాల సంఖ్య, ఆయా మార్గాల్లో వెళ్లగల వాహనాల వివరాలను ముందుగానే గుర్తించి రవాణా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ నెల 26న మైక్రో పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 596 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఫొటో ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభించినట్లు వివరించారు. తెనాలి పురపాలక సంఘం పరిధిలో 185 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని కమిషనర్ జె. రామ అప్పల నాయుడు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణ కోసం నాలుగు జోన్లు, 18 రూట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సప్లిమెంటరీ ఓటరు జాబితా అందినట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు, రూట్ అధికారులు పాల్గొన్నారు.

# నవంబరు 1న పోలింగ్.. స్థానిక సెలవు

## అక్టోబరు 31, నవంబరు 1, 3 తేదీల్లో ఎన్నికల భవనాలకు సెలవులు

**గుంటూరు, రక్షణ**

: గుంటూరు నగరపాలక సంస్థ, తెనాలి పురపాలక సంఘం పరిధిలో నవంబరు 1న జరగనున్న పోలింగ్ నేపథ్యంలో స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా వినియోగిస్తున్న భవనాలకు అక్టోబరు 31, నవంబరు 1, 3 తేదీల్లో సెలవులు వర్తిస్తాయని వెల్లడించారు.ఎన్నికల ఏర్పాట్లపై శనివారం మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు), రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు, రూట్ అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా



ఎన్ని కల నిర్వహ ణకు తీసుకోవాల్సిన చర్యలు, పోలింగ్ ఏర్పాట్లు, సెల వుల అమలుపై అధికారులకు సూచనలు చేశారు .పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు నిర్వహించే ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం, 1881 పరిధిలోకి వచ్చే సంస్థలకు కూడా నిబంధనల ప్రకా రం సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు. పోలిం గ్‌కు ముందు రోజు అక్టోబరు 31న, పోలింగ్ రోజు నవంబరు 1న, ఓట్ల లెక్కింపు రోజు నవంబరు 3న పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలుగా వినియోగిస్తున్న ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు, ఇతర భవనాల్లో సాధారణ కార్యకలాపాలకు స్థానిక సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.

# ఓటమి భయంతోనే వైసీపీ రాజకీయ డ్రామాలు: ప్రత్తిపాటి

**చిలకలూరిపేట రక్షణ**

వైసీపీ నేతలు ఓటమి భయంతో ప్రజల్లో సానుభూతి పొందేందుకు, పార్టీ అధినేత మెప్పు కోసం రాజకీయ డ్రామాలకు తెరతీస్తున్నారని ప్రత్తిపాటి విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసులపై దూకుడుగా వ్యవహరిస్తూ కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న పల్నాడు ప్రాంతంలో రాజకీయ చిచ్చు రేపి ప్రజలను భయాందోళనకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. చిలకలూరిపేటలో వైసీపీ నాయకురాలు పోలీసులపై వ్యవహరించిన తీరును ప్రస్తావిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.వైసీపీ నేతలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థలను, అధికారులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ప్రత్తిపాటి ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రావడం లేదని, ప్రజల్లో విశ్వాసం కోల్పోవడంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అయితే వైసీపీ నేతలు మాత్రం హింసాత్మక, ప్రతీకార రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు .రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో వైసీపీ తరఫున నామినేషన్లు దాఖలవుతున్నాయని పేర్కొంటూ, నామినేషన్లను అడ్డుకుంటున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని ప్రత్తిపాటి అన్నారు. పోలీసులు, అధికారులు




సహకరించకపోతే అభ్యర్థులు నామినేషన్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ప్రజల్లో స్వేచ్ఛగా తిరుగుతూ ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్తతలు సృష్టించి, అనంతరం వాటిని కూటమి పార్టీలకు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.కూటమి పాలనలో పల్నాడు ప్రాంతం అభివృద్ధి, సంక్షేమానికి వేదికగా మారుతోందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. గతంలో రాజకీయ ఉద్రిక్తతలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఈ ప్రాంతంలో మళ్లీ అలాంటి పరిస్థితులు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చిలకలూరిపేటతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూటమి శ్రేణులను రెచ్చగొట్టే చర్యలకు వైసీపీ నేతలు పాల్పడుతున్నారని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగితే భవిష్యత్తులో తమ పార్టీ ఉనికి తగ్గిపోతుందన్న భయంతోనే ఇలాంటి రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.చిలకలూరిపేటలో వైసీపీ నాయకురాలిని గృహ నిర్బంధంలో ఉంచిన ఘటనపై స్పందిస్తూ, పోలీసులు ముందుగా ఇచ్చిన అనుమతులను దుర్వినియోగం చేసినందునే ఆమెను మరోసారి నమ్మలేదని ప్రత్తిపాటి పేర్కొన్నారు. రావులపాలెం వెళ్లాల్సి ఉందని ముందుగా పోలీసులకు చెప్పి, అనంతరం ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేశారని విమర్శించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు అడ్డంకులు కలిగించేలా వ్యవహరిస్తే వారు చర్యలు తీసుకోకుండా ఎలా ఉంటారని ప్రశ్నించారు. అయితే ఈ ఘటనకు సంబంధించి వైసీపీ వాదనను ఆయన ప్రకటనలో ప్రస్తావించలేదు.ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రాజకీయ ప్రయోజనాల కోసం శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకూడదని ప్రత్తిపాటి అన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన పార్టీ నేతలు ప్రచార ఆర్భాటాలతో తిరిగి ఆదరణ పొందలేరని పేర్కొన్నారు. వైసీపీ నేతల రాజకీయ విన్యాసాలను పార్టీ అధినేత అభినందించవచ్చేమో కానీ ప్రజలు మాత్రం అంగీకరించరని వ్యాఖ్యానించారు.స్థానిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రత్తిపాటి కోరారు. కుట్రలు, కుతంత్రాలతో రాజకీయ లబ్ధి పొందాలన్న ప్రయత్నాలు ఫలించవని, ప్రజలు ఎన్నికల్లో తగిన నిర్ణయం తీసుకుంటారని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

# జడ్పీటీసీ బరిలో 115 మంది అభ్యర్థులు



**పల్నాడు, రక్షణ**

పల్నాడు జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. మొత్తం 115 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంజన శ్రీహర్ష వెల్లడించారు. బొల్లాపల్లి, నాదెండ్ల మండలాల్లో ఒక్కొక్క నామినేషన్ చొప్పున మొత్తం రెండు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. మరోవైపు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నిర్వహించనున్న రెండో సాధారణ ఎన్నికలు--2026 పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియల వార్తా కవరేజీ కోసం అక్రిడిటేషన్ కలిగిన మీడియా ప్రతినిధుల వివరాలను అధికారులు కోరారు.ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన చేపట్టారు. ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు స్క్రూటినీ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు కన్నబాబు జిల్లాలో పర్యటించి నామినేషన్ల పరిశీలనను తనిఖీ చేశారు.ఇదిలా ఉండగా, వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల, గురజాల, దాచేపల్లి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో పోలింగ్, కౌంటింగ్ వార్తా కవరేజీ కోసం మీడియా ప్రతినిధుల పేర్లు, ఫొటోలను సమర్పించాలని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు సూచించారు. అక్రిడిటేషన్ కలిగిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అక్టోబరు 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా కేంద్రంలో వివరాలు అందించాలని కోరారు.పెద్ద పత్రికల నుంచి ఒక రిపోర్టర్, ఒక ఫొటోగ్రాఫర్, శాటిలైట్ ఛానళ్ల నుంచి ఒక రిపోర్టర్ లేదా కెమెరామెన్, చిన్న పత్రికల నుంచి ఎడిటర్ లేదా ఆయన నామినేట్ చేసిన ప్రతినిధి పేర్లను సమర్పించాలి. ప్రతినిధి పేరు, హోదా, ఫోన్ నంబరు, అక్రిడిటేషన్ నంబరుతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోలు అందజేయాలి. పల్నాడు జిల్లా అక్రిడిటేషన్ కార్డు కలిగిన వారి పేర్లనే సూచించాలని అధికారులు స్పష్టం చేశారు. పోలింగ్ కవరేజీకి రెండు ఫొటోలు, కౌంటింగ్ కవరేజీకి అదనంగా రెండు ఫొటోలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



## ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

## భద్రత, మౌలిక సదుపాయాలపై అధికారులకు సూచనలు

**చిలకలూరిపేట: రక్షణ**

ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో భాగంగా చిలకలూరిపేటలోని ఏఎంజీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ కోసం కళాశాలలో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా చర్యలు, ఓట్ల లెక్కింపు కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల విధుల నిర్వహణకు అనుకూలంగా ఉన్న వసతులను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఏర్పాటును పూర్తి చేయాలని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూమ్ భద్రత విషయంలో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని, కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు.ఎన్నికల నిర్వహణలో భద్రత, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని తెలిపారు.

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/24/2026 10:11 PM Page 5



# నాదెండ్లలో 44 ఎంపీటీసీ నామినేషన్ల ఆమోదం

**20 స్థానాలకు 44 నామినేషన్లు దాఖలు**



**నాదెండ్ల: రక్షణ**

మండలంలోని 20 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి దాఖలైన 44 నామినేషన్లు ఆమోదం పొందినట్లు రిటర్నింగ్ అధికారి నాగమల్లేశ్వరి తెలిపారు. శనివారం నిర్వహించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ అనంతరం ఆమె వివరాలను వెల్లడించారు.నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసే సమయానికి ఆర్వో కార్యాలయానికి మొత్తం 46 నామినేషన్ సెట్లు అందాయని తెలిపారు. అయితే కనపర్రు ఎంపీటీసీ స్థానానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు రెండేసి సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేయడంతో, నిబంధనల ప్రకారం వాటిని ఒక్కో నామినేషన్‌గా పరిగణించినట్లు వివరించారు. దీంతో మొత్తం నామినేషన్ల సంఖ్య 44కు చేరిందన్నారు.నామినేషన్ల పరిశీలన పూర్తయిన అనంతరం మొత్తం 44 నామినేషన్లను ఆమోదించినట్లు ఆర్వో నాగమల్లేశ్వరి స్పష్టం చేశారు.

# జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

**పారదర్శకంగా సిబ్బంది కేటాయింపు.. ఎన్నికల విధులకు సిద్ధం కావాలి**



**బాపట్ల, రక్షణ**

జిల్లాలో నవంబరులో నిర్వహించనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ), ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓ) కేటాయింపు కోసం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా సిబ్బందిని కేటాయించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ వి. తెలిపారు.జిల్లా కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్‌లో శనివారం సాధారణ ఎన్నికల పరిశీలకురాలు ఏఏఎల్ పద్మావతి, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించే ప్రక్రియను పూర్తి చేశారు.ఎన్నికల విధుల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సిబ్బంది కేటాయింపు చేపట్టామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఆర్వో లవన్న, డీపీఓ నరేష్ కుమారి, డీఈఓ శ్రీనివాస్ సింగ్, సీపీఓ ఏఎస్ రాజు, కలెక్టరేట్ ఏఓ మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.హాసిని, గ్రామ, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వంత్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీలోకి భారీగా చేరికలు

**బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు సమక్షంలో పార్టీలో చేరిన 13 మంది**



**బాపట్ల: రక్షణ**

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం పెదగొల్లపాలెం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 13 మంది నాయకులు శనివారం కర్లపాలెంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలనపై ఆకర్షితులై పలువురు నాయకులు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కొత్తగా పార్టీలో చేరినవారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.మార్పు చెన్నైవారిపాలెం గ్రామం నుంచి దక్కుమల్లి భాస్కరరావు, పెరికల సురేష్, కాగిత సాల్మన్ రాజు, మార్పు మురళి; యారంవారిపాలెం నుంచి యారం సోమయ్య, మల్లెల విక్టర్ బాబు, మల్లెల సత్యం, జోపూడి సందీప్, జోపూడి రవి, యారం ఇశ్రాయేలు, కొరపాటి వినయ్, పెరికల చందు; బత్తులవారిపాలెం నుంచి బత్తుల చందు టీడీపీలో చేరారు.కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, చీరాల మాజీ ఎమ్మెల్యే గోవర్ధన్‌రెడ్డి, స్థానిక ఎన్నికల పరిశీలకులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, కర్లపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపి, పార్టీ అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని సూచించారు.

# ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**గుంటూరు, రక్షణ**

నగర పాలక సంస్థ స్థానిక ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన, పారదర్శకమైన ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సుల తరలింపు నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.తొలుత రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లకు సంబంధించి సిద్ధం చేసిన మ్యాప్‌ను కమిషనర్ పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులతో వచ్చే వాహనాలను నిర్దేశించిన మార్గంలో యూనివర్సిటీ ప్రాంగణంలోకి తీసుకురావాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు



చేపట్టాలని, బ్యాలెట్ బాక్సులను క్రమపద్ధతిలో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు .అ నంతరం కౌంటింగ్ హాళ్లను పరిశీలించిన ఆయన, ఎన్నికల ఏజెంట్లు, సిబ్బంది వేర్వేరు మార్గాల్లో హాళ్లలోకి ప్రవేశించేలా బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కౌంటింగ్ హాల్‌లో సీసీ కెమెరాలను అమర్చాలని సంబంధిత సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా హాళ్లలో లైటింగ్, ఫ్యాన్లు సక్రమంగా పనిచేసేలా ముందుగానే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.పోలింగ్ ముగిసిన రోజు, ఓట్ల లెక్కింపు రోజు విధులు నిర్వహించే సిబ్బందికి భోజన సదుపాయాలు కల్పించాలని, ఇందుకోసం అవసరమైన చోట్ల స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. విధుల్లో ఉన్న సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు సిద్ధం చేయాలని పేర్కొన్నారు.జోనల్, రూట్ అధికారులతో మాట్లాడుతూ.. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రానికి, అక్కడి నుంచి రిసెప్షన్ కేంద్రానికి బ్యాలెట్ బాక్సులు చేరే వరకు ప్రతి అధికారి బాధ్యత తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. వాహనాలు నిర్దేశిత మార్గాల్లోనే ప్రయాణించేలా పర్యవేక్షించాలని, ఎన్నికల సామగ్రి తరలింపులో ఎలాంటి లోపాలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు.పర్యటనలో సిటీ ప్లానర్ డి.రాంబాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.వెంకటేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, సర్వేయర్లు లక్ష్మీనారాయణ, సుభాని తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించండి

**చీరాలలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య.. అంకమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**చీరాల, రక్షణ**

: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతి వార్డుకు చేరాలంటే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం చీరాల పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, ఆరో వార్డు అభ్యర్థి కొప్పోలు అన్నపూర్ణ, 32వ వార్డు అభ్యర్థి పాలవలస రమాదేవి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థి హానీ స్పందన విజయమే లక్ష్యంగా ప్రచారం నిర్వహించారు. మరోవైపు పట్టణంలోని శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఇదే అభివృద్ధి స్థానికంగా కొనసాగాలంటే కూటమి బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో



గెలిపించాలని కోరారు. 'చెప్పాం.. చేస్తున్నాం' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామనే విశ్వాసంతో ఓట్లు అభ్యర్థిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.చీరాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రశాంతమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కూటమి అభ్యర్థుల గెలుపు కీలకమని స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య నాయకత్వంలో మున్సిపల్ ఛైర్మన్ పదవితో పాటు మెజారిటీ కౌన్సిలర్ స్థానాల్లో కూట మి విజయం సాధిస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం చీరాల పట్టణంలో వైభవంగా నిర్వహించిన శ్రీ అంకమ్మ తల్లి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ ఉత్సవాలు ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా ముగిశాయి. ముగింపు వేడుకలను తిలకించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు చీరాల పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రముఖులు, కూటమి పార్టీల నాయకులు, మిత్రపక్షాల నేతలు, మహిళా నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు

**బాపట్ల రక్షణ న్యూస్**



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులకు శనివారం బాపట్ల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కె. విజయ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా అక్రమ మద్యం రవాణా, నిల్వ, విక్రయాలకు దూరంగా ఉండాలని అధికారులు వారికి సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడకుండా, చట్టాలను గౌరవిస్తూ వ్యవహరించాలని హితవు పలికారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అక్రమ మద్యం రవాణా, విక్రయాల నియంత్రణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు. అక్రమ మద్యం రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**గుంటూరు రక్షణ న్యూస్**

కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, లక్ష్మీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్, వీఆర్‌కే ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వేములపల్లి రవికిరణ్ జన్మదినం సందర్భంగా మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రవికిరణ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నక్కా ఆనందబాబు ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరింత ముందుకు సాగుతూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన అభిలషించారు.

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/24/2026 10:11 PM Page 6



# మాజీ మంత్రి రజిని ఘటనపై ఎస్ఈసీ సీరియస్

మొదటి పేజీ తరువాయి

**చిలకలూరిపేట: రక్షణ న్యూస్**

మాజీ మంత్రి విడదల రజిని నివాసం వద్ద చోటుచేసుకున్న ఘటనపై రాష్ట్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. నామినేషన్‌కు సంబంధించిన బీ-ఫారం అందించేందుకు బయటకు వచ్చిన రజినిని పోలీసులు అడ్డుకున్నారన్న ఆరోపణలు, ఈ క్రమంలో జరిగిన తోపులాటలో ఆమె కిందపడిన ఘటనపై విచారణకు ఆదేశించింది. చిలకలూరిపేట రూరల్ ఎస్సై ప్రియాంకను ఎన్నికల విధులతో పాటు సాధారణ విధుల నుంచి కూడా తక్షణమే తప్పించాలని పల్నాడు జిల్లా ఎస్పీని ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో ఈ నెల 23న రజిని నివాసం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. తనను కలిసేందుకు వచ్చిన ఎడ్లపాడు జెడ్పీటీసీ అభ్యర్థిని పోలీసులు అడ్డుకోవడంతో వివాదం మొదలైనట్లు సమాచారం. ఈ క్రమంలో రజిని, ఎస్సై ప్రియాంక మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. దీంతో రజిని కిందపడిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు, వార్తా కథనాలు చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యవహారంపై మాజీ మంత్రి రజిని అందించిన ఫిర్యాదు, ఛాయాచిత్రాలను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలకు ఉపక్రమించింది. ఘటనపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని పల్నాడు జిల్లా ఎస్పీని ఆదేశించింది. అందుబాటులో ఉన్న వీడియో దృశ్యాలను పరిశీలించడంతో పాటు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అక్టోబరు 24న ఈ మేరకు లేఖ జారీ చేశారు. విచారణలో తేలిన అంశాల ఆధారంగా బాధ్యులైన అధికారులపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఘటనపై తీసుకున్న చర్యల నివేదికను అదే రోజు సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో విధులు నిర్వహించే అధికారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు, ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

# తప్పిన పెను ప్రమాదం.. ముళ్లపొదల్లోకి స్కూల్ బస్సు!

## 51 మంది విద్యార్థులతో వెళ్తుండగా ఘటన.. డ్రైవర్ తీరుపై స్థానికుల ఆగ్రహం




**చిలకలూరిపేట: రక్షణ**

విద్యార్థులతో వెళ్తున్న శ్రీ హర్షిణి విద్యాసంస్థలకు చెందిన స్కూల్ బస్సు అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన ఘటన చిలకలూరిపేట మండలం తాతపూడి సమీపంలో శనివారం చోటుచేసుకుంది. జాతీయ రహదారి సమీపంలోని కోల్డ్ స్టోరేజ్ సర్వీస్ రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది. ఘటన సమయంలో బస్సులో సుమారు 51 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. బస్సు ముళ్లపొదల్లోకి దూసుకెళ్లడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. పెను ప్రమాదం తప్పడంతో తల్లిదండ్రులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బస్సు వేగంగా వెళ్తున్న సమయంలో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వాహనం అదుపుతప్పింది. ఈ క్రమంలో డ్రైవర్ పక్కన ఉన్న కిటికీ అద్దాలు పగిలి, ఒక విద్యార్థిని బస్సులో నుంచి బయటకు ఎగిరిపడి ముళ్లపొదల్లో పడినట్లు వారు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి గాయాలయ్యాయనే విషయంపై స్పష్టమైన సమాచారం తెలియాల్సి ఉంది. ఈ విద్యాసంస్థకు చెందిన రెండు బస్సులు ప్రతిరోజూ చిలకలూరిపేట వైపు రాకపోకలు సాగిస్తుంటాయని స్థానికులు చెబుతున్నారు. బస్సుల డ్రైవర్లు పోటాపోటీగా, మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతున్నారని ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడుపుతున్నాడని కూడా స్థానికులు ఆరోపణలు చేశారు. అయితే, ఈ ఆరోపణలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. విద్యార్థుల భద్రత విషయంలో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ బస్సుల వేగాన్ని నియంత్రించడంతోపాటు డ్రైవర్ల ప్రవర్తన, అర్హతలు, విధి నిర్వహణ తీరుపై అధికారులు తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మద్యం సేవించి వాహనం నడిపినట్లు తేలితే సంబంధిత డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రవాణా, పోలీసు శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

# గుంటూరు అభివృద్ధే అజెండా!

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు పొలిటికల్ స్పెషల్**

గుంటూరు: నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గుంటూరు నగర కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతం చేశారు. ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంతో పాటు 59వ డివిజన్ సుగాలి కాలనీ, బ్రాడీపేటలో ఇంటింటి ప్రచారం, వివిధ వర్గాలతో సమావేశాల ద్వారా ప్రజలను కలిశారు. నగర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు. మరోవైపు కూటమి నేతలు, కార్పొరేటర్ అభ్యర్థులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు.

**అభివృద్ధి పనులకు ప్రాధాన్యం...** డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ తనకు మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించడం సంతోషకరమన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు మార్గదర్శకత్వంలో నగర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు.

**59వ డివిజన్‌లో అభివృద్ధిపై చర్చ...** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 59వ డివిజన్ సుగాలి కాలనీలో మాదాల చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు అందరితో కలిసి పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ గతంలో 59వ డివిజన్‌లో వర్షాకాల ముంపు, రహదారులు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇటీవలి కాలంలో ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

**కూటమి నేతల సమన్వయానికి పిలుపు...** డేగల ప్రభాకర్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అతివిశ్వాసానికి తావివ్వకుండా ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు పార్టీ శ్రేణులు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్, బూర్ల రామాంజనేయులు, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాసరావు తదితరులు ఐక్యత, పరస్పర సహకారం ప్రాధాన్యాన్ని వివరించారు.

**వివిధ వర్గాల మద్దతు కోరుతూ..** రాష్ట్ర వాణిజ్య విభాగం నాయకుడు అత్తులూరి సుబ్బారావు ఆర్యవైశ్యులు, వ్యాపారవర్గాలు లక్ష్మీ అపర్ణ విజయానికి కృషి చేయాలని కోరారు. గుంటూరు అభివృద్ధికి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. టీడీపీ బీసీ విభాగం నాయకులు కూడా లక్ష్మీ అపర్ణను శాలువాతో సత్కరించి, బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. బీసీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కోరారు.

**బ్రాడీపేటలో ఇంటింటి ప్రచారం...** ఎన్నికల ప్రచారంలో భాగంగా లక్ష్మీ అపర్ణ బ్రాడీపేటలో పర్యటించి ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. 41వ డివిజన్ కూటమి కార్పొరేటర్ అభ్యర్థి గాయత్రి బెహరాతో కలిసి ఓటర్లను కలుసుకుని మద్దతు కోరారు.

**ప్రైవేటు ఉపాధ్యాయులతో సమావేశం...** ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 600 మందికి పైగా ఉపాధ్యాయులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు. నగరంలో ప్రారంభమైన అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించి మరింత ముందుకు తీసుకెళ్తానన్నారు. ఎన్నారై విద్యాసంస్థల డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు మహిళా నాయకత్వానికి మద్దతు తెలిపారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం నూతలపాటి అంజయ్య నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తావించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్పొరేటర్ అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ నగరాభివృద్ధికి కృషి చేయాలని లక్ష్మీ అపర్ణ పేర్కొన్నారు.

# కూటమిలో సీట్ల కుస్తీ!

మొదటి పేజీ తరువాయి

**ఎడిటర్ నరేంద్ర**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్థానిక ఎన్నికల వేడి మొదలవుతుండగా.. కూటమి రాజకీయాల్లో మాత్రం సీట్ల లెక్కలు ఇంకా తేలడం లేదు. వార్డు సభ్యుడి స్థానం నుంచి మున్సిపల్ కార్పొరేటర్, కౌన్సిలర్, ఎంపీటీసీ, జడ్పీటీసీ వరకు ఎవరికి ఎన్ని స్థానాలు కేటాయించాలన్న దానిపై ఏకాభిప్రాయం కుదరడం లేదు. రాష్ట్రస్థాయిలో కలిసున్న పార్టీలు.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి తమ బలాన్ని నిరూపించుకునే పనిలో పడుతున్నాయి. ప్రతి వార్డులోనూ తమ అభ్యర్థే ఉండాలన్న పట్టుదల ఒకవైపు.. మిత్రపక్షానికి అవకాశం ఇవ్వాలన్న రాజకీయ సమీకరణ మరోవైపు.. వెరసి స్థానిక నాయకత్వానికి సీట్ల సర్దుబాటు సవాల్‌గా మారుతోంది.

**గ్రామస్థాయి నుంచే అసలు పరీక్ష!**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, పల్నాడు, బాపట్ల ప్రాంతాల్లో స్థానిక రాజకీయాలు గ్రామం, వార్డు స్థాయిలోనే బలంగా ప్రభావితం అవుతాయి. ఇక్కడ పార్టీ గుర్తుతోపాటు అభ్యర్థి వ్యక్తిగత పరిచయాలు, కుటుంబ నేపథ్యం, స్థానికంగా చేసిన పనులు, సామాజిక సమీకరణాలు కూడా కీలకంగా మారతాయి. దీంతో ఒక వార్డును మిత్రపక్షానికి కేటాయించడం అంటే కేవలం ఒక సీటును వదులుకోవడం కాదు.. అక్కడ తమ పార్టీకి ఉన్న పట్టు, భవిష్యత్తు రాజకీయ అవకాశాలపైనా ప్రభావం పడుతుందన్న ఆందోళన నాయకుల్లో కనిపిస్తోంది. ఒకే ప్రాంతంలో రెండు పార్టీలకు చెందిన ఆశావహులు పోటీకి సిద్ధమైతే ఎవరిని బరిలోకి దింపాలి? ఎవరు వెనక్కి తగ్గాలి? సీటు దక్కని నేతకు మరో అవకాశం ఎలా కల్పించాలి? అన్న ప్రశ్నలు స్థానిక నాయకత్వాన్ని వెంటాడుతున్నాయి. పైస్థాయిలో సర్దుబాటు కుదిరినా క్షేత్రస్థాయిలో అసంతృప్తులు చల్లారకపోతే రెబల్స్ రంగంలోకి దిగే ప్రమాదం ఉంటుంది. అదే జరిగితే ప్రత్యర్థి పార్టీలకు పరోక్షంగా ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

**ఎమ్మెల్యేలకు అగ్నిపరీక్ష!...** నియోజకవర్గాల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయం సాధించడం ఎమ్మెల్యేలకు కీలక బాధ్యతగా మారుతోంది. తమ పార్టీ నేతలకు న్యాయం చేయాలా? మిత్రపక్షం బలంగా ఉన్నచోట వారికి అవకాశం ఇవ్వాలా? అన్నది తేల్చుకోవాల్సి వస్తోంది. ప్రతి ఆశావహుడికీ స్థానికంగా అనుచర గణం ఉండటంతో ఒకరికి టికెట్ ఇస్తే మరొకరు అసంతృప్తికి గురయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. ఎన్నికలకు ముందే ఈ విభేదాలను పరిష్కరించకపోతే ప్రచార సమయంలో సమన్వయ లోపాలు బయటపడే అవకాశం ఉంది. మరోవైపు, సీట్ల కేటాయింపుపై స్పష్టత కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఏ పార్టీ తరపున పోటీ చేయాలి? ప్రచారాన్ని ఎప్పుడు ప్రారంభించాలి? స్థానికంగా మద్దతు కూడగట్టేందుకు ఎంత సమయం ఉంటుంది? అన్న సందిగ్ధత వారిని వెంటాడుతోంది. చివరి నిమిషం వరకు నిర్ణయం వాయిదా పడితే అభ్యర్థుల ఎంపిక, ప్రచార ప్రణాళిక, కార్యకర్తల సమీకరణ అన్నీ ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది.

**పొత్తు పైస్థాయిలో.. పేచీలు క్షేత్రస్థాయిలో!..** పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకం ఖరారైనప్పటికీ, వార్డుల వారీగా అభ్యర్థుల ఎంపిక, గ్రామీణ స్థానిక సంస్థల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల సర్దుబాటు కొత్త సవాళ్లను తెచ్చిపెడుతున్నాయి. అక్టోబరు 24 నాటికి గ్రామీణ స్థానాల్లో సీట్ల పంపకంపై అగ్రనేతల చర్చలు కొనసాగుతున్నట్లు వార్తలు వెలువడ్డాయి.

**సామాజిక సమీకరణాలూ కీలకమే!...** స్థానిక ఎన్నికల్లో కేవలం పార్టీ బలమే అభ్యర్థి ఎంపికకు ప్రాతిపదిక కాదు. కుల, సామాజిక సమీకరణాలు, స్థానికంగా నాయకుడికి ఉన్న పరిచయాలు, ఆర్థిక స్థోమత, కార్యకర్తల మద్దతు, గత ఎన్నికల్లో సాధించిన ఫలితాలు.. ఇలా అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేయాల్సి రావడం కూడా సీట్ల సర్దుబాటును క్లిష్టం చేస్తోంది. ముఖ్యంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గ్రామస్థాయి రాజకీయాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఒక గ్రామంలో టీడీపీకి బలమైన నాయకుడు ఉంటే, మరో గ్రామంలో జనసేనకు పట్టున్న నేత ఉండవచ్చు. ఇంకోచోట బీజేపీ నాయకులు తమకు తగిన ప్రాతినిధ్యం కావాలని పట్టుబట్టవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రస్థాయి సూత్రాలను యథాతథంగా అమలు చేయడం కంటే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం అవసరం.

**సీటు రాకుంటే రెబల్ బాటేనా?...** టికెట్ ఆశించి చివరి వరకు ఎదురుచూసిన నాయకుడికి అవకాశం దక్కకపోతే అసంతృప్తి సహజం. అయితే ఆ అసంతృప్తి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగే స్థాయికి చేరితే కూటమి అభ్యర్థి ఓట్లపై ప్రభావం పడవచ్చు. కొన్ని చోట్ల అధికారిక అభ్యర్థి కంటే రెబల్ అభ్యర్థికి వ్యక్తిగత పరిచయాలు, స్థానిక మద్దతు ఎక్కువగా ఉండే అవకాశం కూడా ఉంటుంది. అందువల్ల నామినేషన్ల ఉపసంహరణకు ముందే అసంతృప్తులను బుజ్జగించడం, వారికి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యం కల్పించే విషయంలో స్పష్టత ఇవ్వడం నాయకత్వానికి అవసరం.

**సమన్వయమే అసలైన బలం!...** కూటమి అంటే ఎన్నికల సమయంలో కలిసి పోటీ చేయడమే కాదు.. అధికారంలోనూ, స్థానిక పాలనలోనూ పరస్పర సహకారంతో ముందుకు సాగడం. ఒక పార్టీ బలాన్ని మరో పార్టీ గుర్తించడం, గెలుపు అవకాశాలున్న చోట పరస్పర అవగాహనతో నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యం. సీట్ల పంపకంలో ఒక పక్షానికి అన్యాయం జరిగిందన్న భావన కలిగితే, అది ఎన్నికల అనంతరం కూడా సంబంధాలపై ప్రభావం చూపవచ్చు. ఎమ్మెల్యేలకు ఈ ఎన్నికలు మరో రకమైన పరీక్ష. తమ పార్టీ శ్రేణులను సంతృప్తిపరచడంతోపాటు మిత్రపక్షాల అభ్యర్థులకు సహకారం అందించేలా చూడాలి. స్థానిక నాయకుల మధ్య విభేదాలను పరిష్కరించలేకపోతే వాటి ప్రభావం నియోజకవర్గ రాజకీయాలపైనా పడే ప్రమాదం ఉంది. చివరికి ప్రజలకు కావాల్సింది ఎవరు ఏ పార్టీ తరపున పోటీ చేస్తున్నారన్నదొక్కటే కాదు.. తమ ప్రాంత సమస్యలను ఎవరు పరిష్కరిస్తారు? తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ వంటి సమస్యలపై ఎవరు స్పందిస్తారు? అన్నదే ముఖ్యం. కూటమి నేతలు సీట్ల లెక్కల్లోనే మునిగిపోకుండా ప్రజల అవసరాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. సీట్ల సర్దుబాటు తాత్కాలిక వ్యవహారం.. ఐక్యత మాత్రం దీర్ఘకాలిక పెట్టుబడి. ఆ తేడాను గుర్తించి నాయకత్వం అడుగులు వేస్తేనే కూటమి బలం ఓట్లుగా మారుతుంది. లేకపోతే పైస్థాయిలో పొత్తు.. క్షేత్రస్థాయిలో పోరు అన్న పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది.